# ఆపాత మధురం

ఓ ఆదివారం నాలుగు గంటల వేళ తోచలేదని బయటికి తీసికెళ్లమని మారాం చేస్తున్న కూతురికి ఇదిగో నీకు మంచి సినిమా కన్నా బాగుండేది చూపిస్తాను అంటూ లాప్‌టాప్ ఆన్ చేసింది కీర్తన. బోర్లా పడుకుని గడ్డానికి చేతులాన్చి చూస్తున్న శృతి కళ్లు ఆనందంగా, విభ్రమంగా చూస్తూ 'మమ్మీ మమ్మీ చూడుచూడు ఆ పిట్ట పిల్లలు నోళ్లు ఎలా తెరిచాయో. పిట్ట చూడు నోట్లో ఎలా పెడుతుందో అన్నం'. కొమ్మకి వేలాడుతున్న గిజిగాడి గూడులో బంగారుపిట్ట పిల్లలు నోళ్లు తెరచుకు నుంటే, రెక్కలు టపటపలాడిస్తూ ఎగురుతూ నోట్లో ఆహారం పెడ్తున్న ఆదృశ్యం వింతగా చూస్తు అరిచింది.

"పిట్ట పిల్ల ఏమిటే, బలే పేరు పెట్టావు' కీర్తన నవ్వింది.

"మరేం అనాలి. పిట్ట కదా, దాని పిల్ల కదా... 'పెద్ద కళ్లని తిప్పుతూ ఆ కళ్లమీద పడిన జుత్తుని తోసుకుంటూ ప్రశ్నార్థకంగా చూసింది."

'పిచ్చుక పిల్ల అంటాం. పక్షి పిల్ల అనాలా, పక్షి కూన అనాలా...' తల్లే సందేహంలో పడింది.

'అమ్మా చూడు... చూడు... ఆ నెస్ట్.. కాకి పిల్లలు ... ఎంత క్యూట్‌గా ఉన్నాయో.' మరో దృశ్యం – మరో కేక – ఆనందం ఆశ్చర్యం.

"మమ్మీ చూడు చూడు... ఏంటివి?" ఉడతలు చూపిస్తూ అడిగింది.

"స్క్విరల్స్.. ఉడతలు అంటారు." సపోటా చెట్టుమీద చెంగుచెంగున కొమ్మల మీంచి దుముకుతూ పక్కానికి వచ్చిన కాయలు ముందు కాళ్లతో పట్టుకు కొరుకుతూ,

'మమ్మీ... మనం తిన్నట్టే తింటుంది చూడు....' సంబరంగా అంది. కూతురు ఆశ్చర్యానందాలు చూస్తుంటే చిన్నప్పుడు సపోటా చెట్టు కొమ్మల మధ్య ఎలుకలబోను పెట్టి ఉడతలని పట్టుకుని కాసేపు ఆనందించి, ఆడి, విడిచిపెట్టేస్తే తుర్రుమని పారిపోవడం ... ఇప్పటి పిల్లలు ఈ దృశ్యాలు ఎలా చూస్తారు...?"

"మమ్మీ ... నాకో ఉడతనివ్వవు... ఆడుకుంటాను..." ఆశగా అడిగింది.

"వద్దమ్మా వాటిని పట్టుకుని బోనులో పెట్టకూడదు. పాపం వస్తుంది..." అంటూ రామదాసు చిలకలని పట్టుకుని బంధించిన కథ చెప్పింది... శృతి కళ్లల్లో కాస్త నిరాశ....

"మమ్మీ ... చూడు ఆ పారట్ జామకాయని ఎర్రముక్కుతో ఎలా కొరుకుతూందో మరో దృశ్యం! మరో ఆశ్చర్యం. చిలక కొరికిన పండ్లు తెల్లారి కింద పడితే ఏరుకుని గౌనుతో తుడుచుకు తినడం ... చిన్నతనంలో ఎన్ని ముచ్చట్లో...

"అమ్మా.. ఆవు పిల్ల చూడు అమ్మదగ్గిర ఎలా పాలు తాగుతుందో.. అమ్మా అలా పొడుస్తుందేమిటి, ఆవు అమ్మకి నొప్పెట్టదూ...?" ఆవు దూడ పొదుగు కుమ్మి కుమ్మి పాలు తాగుతున్న దృశ్యం చూసి శృతి అంది.

"అమ్మలకి నొప్పెట్టదమ్మా... నీవు నా కడుపులో వుండగా ఎలా తన్నే దానివో తెలుసా" నవ్వింది కీర్తన... 'బాగా నొప్పెట్టేదా అమ్మా... సారీ అమ్మా...' శృతి బాధపడ్తూ అంది. "ఛా... అదేం లేదు... అందరూ కడుపులో ఉండగా అలాగా తిరుగుతూ తంతారు. అది నొప్పెట్టదు. అమ్మలు అసలు బాధపడరు. సంతోషిస్తారు' అంది. శృతి దృష్టి మళ్లీ లాప్‌టాప్ మీదకి మళ్లింది. ఆవుదూడ పాలు తాగి పెరడంతా చెంగుచెంగున గెంతుతూ ఉంది. మరో దృశ్యం. పిల్లి వసారాలో పడుకుంటే నాలుగు పిల్లలు తల్లిమీద నించి గెంతుతూ, వాళ్లలో అవి పోట్లాడుకుంటూ ఆడుకుంటున్నాయి.

"మమ్మీ... పిల్లి పిల్లలు ఎంత క్యూట్‌గా ఉన్నాయో చూడు..." వాటిని పట్టుకోడానికన్నట్టు చేయి చాపింది... లాప్‌టాప్ వైపు.

పెరటినిండా విరబూసిన బంతిపూలు... రంగురంగుల్లో వాటిమీద సీతాకోక చిలకలు ... మరోచోట ... రంగు రంగుల చామంతులు...

"ఇంత మంచి గార్డెనుండేదా అమ్మా మీ ఇంట్లో..." పూలని స్క్రీన్‌మీద తాకుతూ అడిగింది. వీధి వైపంతా పూల మొక్కలు – పెరట్లో మామిడి, పనస, సపోటా,

జామ ఎన్ని చెట్లుండేవో మా అమ్మమ్మ గారింట్లో... పిల్లలం అందరూ శలవులకి వెళ్లినప్పుడు చెట్లమీదే వుండేవారం. ఎన్ని రకాల ఆటలో..." అంది కీర్తన పాతరోజులు తల్చుకుంటూ పారవశ్యంగా... శృతి తల్లివంక చూస్తూ... "మరి మన అమ్మమ్మ గారింటికి శలవులకి ఎవరూ రారు. ఎందుకు ఇప్పుడు?"

"ఎవరున్నారు. మా అక్క అన్నయ్య ఇద్దరూ అమెరికాలో ఉంటారు. అంతదూరం నించి ప్రతి శలవులకి రాలేరుగా... వచ్చినా ఇప్పుడు అమ్మమ్మగారింట్లో పెరడుతోట ఎక్కడున్నాయి. ఇల్లు, అమ్మేసి అపార్ట్‌మెంట్స్‌కి వెళ్లిపోయారు చేసుకోలేక. ఇద్దరూ ముసలివాళ్లయిపోయారు గదా. అప్పుడు మా అమ్మమ్మకి ఆరుగురు పిల్లలు. దొడ్డమ్మలు, పిన్నులు, మామయ్యలు... అందరూ శలవలకి పిల్లలతో వచ్చేవారు. ఆ రోజుల్లోలా ఇప్పుడెలా ఉంటాయి."

శృతి కళ్లలో అసూయ... 'ఎంత బాగుండేదో కదా. అందరూ వచ్చి సరదాగా పిల్లలు ఆడుకోడం ... మీరంతా ఎంత లక్కీ.. నాకే ఎవరూ లేరు ఆడుకోడానికి' కినుకుగా అంది. 'అమ్మమ్మగారిల్లు ఎందుకమ్మేశారు. మేం పిల్లలం ఆడుకోడానికి లేకుండా' నిలేసింది. అసలు... చెట్లు లేకుండా మన అపార్ట్‌మెంట్స్ ఎందుకు కట్టారు.'

"ఏం చేస్తారు తల్లీ! ... జనం ఎక్కువయితే ఉండడానికి చోటేలేక ఇల్లు కూల్చేసి ఆ చోటులో ఏభై ఇళ్లు కడ్తున్నారు. ఇంక చెట్లకి చోటేది."

"మరి ఆ ఉడతలు, చిలకలు, పిట్టలు అవి ఎక్కడున్నాయి. అవెక్కడికి పోయాయి?"

"చెట్లున్నచోటు వెతుక్కుంటూ పల్లెటూళ్లకి, లేకపోతే అడవులకి పోయి ఉంటాయి. పిచికలు లాంటివి ఇంటి చూరులో గూడు కట్టేవి... ఇప్పుడసలు అవన్నీ కనపడడమే లేదు. అంతరించిపోయాయి గాబోలు."

"అమ్మ మనం కూడా ఏదన్నా పల్లెటూరు వెళ్లిపోదామా?' ఆశగా అడిగింది.

"ఎలా వెడతాం. నీకు మంచి స్కూలు - నాకు ఆఫీసు అన్నీ చిన్న ఊర్లలో వుండవు. ఈసారి ఏదన్నా శలవులకి ఎక్కడికన్నా తీసికెడతాలే.' ఊరడింపుగా అంది. 'ప్రామిస్' అంది. కూతురుచేయి ప్రేమగా నొక్కి 'ప్రామిస్' అంది కీర్తన.

నిజంగా ఎంత మంచిదయింది. పాపనెత్తుకుని అమ్మమ్మగారింటికి వెళ్లినప్పుడు వీడియో కెమెరాతో షూట్‌చేసింది. పాప పెద్దయితే తన తాతగారిల్లు పల్లెటూర్లు ఎలా ఉంటాయో చూపాలని, ఇప్పుడింక ఈతరం పిల్లలు ఆవు దూడలని,

ఉడతలని, పక్షులని, పొలాలని, చెట్లు చేనులను అన్నీ సీడీల్లో చూసి ఆనందించాల్సిందే మరి.

"ఏమిటే రోజంతా పిచ్చెక్కినట్లు చెట్లు, పుట్టలు, పక్షులు, పిల్లులు, ఆవులు, గేదెలు ఫోటోలు తీస్తున్నావు. మాటమంతి లేదు కెమెరా పట్టుకు తిరుగుతున్నావు" అమ్మమ్మ కేకలేసింది. "ఉండు అమ్మమ్మా, పాప పడుకుంది. ఇవన్నీ ఎందుకు తీస్తున్నానో తెలుసా, పాప పెద్దయ్యాక అమ్మమ్మగారి ఊరు ఈ ఇల్లు, తోటలు అవి చూపించద్దా."

"అంటే, ఫోటోలే చూపిస్తావా, మళ్లీ రానే రావేమిటి, లేకపోతే మళ్లీ నీవు వచ్చేసరికి మేం ఉండమనా..." అమ్మమ్మ అలక.

"ఏమో మళ్లీ ఎప్పుడవుతుందో, ఇండియా వచ్చినా, ఈ ఊరు వచ్చే వీలుంటుందో లేదో..."

"ఏమో తల్లీ ఈ అమెరికాలు ఉద్యోగాలు, మొహాలు చూసుకోడమే అపురూపం అయిపోతుంది. ఏదో కూతురును చూపించాలనేనా ఈ ముసలి వాళ్ల దగ్గరికి వచ్చావు. అంతేచాలు." అప్పుడే నిద్రలేచిన మునిమనువరాలిని ఆప్యాయంగా లేపి ఎత్తుకుంది. "పాప చూశావా, ఎంత సేపు నిద్రపోయిందో... పిల్లలకి నీళ్లు, పాలేనే బలం. చక్కగా నూనెమర్దనా చేసి, నలుగుపెట్టి, వేడివేడి నీళ్లుపోస్తే వాళ్లకి వళ్లునొప్పులు అని లేకుండా, తేలికగా ఉండి వళ్లరగకుండా పడుకునేవారు. ఇదివరకు పిల్లలు - మీరేదో బేసిన్‌లో నీళ్లలో గిన్నె కడిగినట్టు సబ్బు పామి తొలిచేస్తున్నారు."

నిజమే ఆ మాట! అమ్మమ్మ స్టూలు వేసుకుకూర్చుని, వెంకటమ్మ కాళ్లమీద పాపని పడుకోబెట్టి నూనెతో పామి పామి మాలిష్‌చేసి, నలుగు పిండితో నలుగుపెట్టి, వేడివేడి నీళ్లు పొట్టమీద ఒక బాల్చీడు, వీపుమీద ఒక బాల్చీడు రుద్దిరుద్ది పోయించింది. అలవాటులేక పాప గోలు గోలున ఏడుస్తుంటే "అమ్మమ్మ ప్లీజ్ పాప ఏడుస్తుంది. అలా గట్టిగా రుద్దద్దు. బాబోయ్ అంత వేడి నీళ్లు వద్దు" అని గోలపెడ్తుంటే" - "ఉండవే తల్లీ. నీ కూతురికేం కాదు. ఆ పూచి నాది" అంటూ స్నానం చేయించి, సాంబ్రాణి పొగవేసి, పౌడరద్ది, పల్చటి గౌనువేస్తే చేతుల్లోనే సొమ్మసిల్లినట్టు నిద్రపోయింది. ఆ పడుకోవడం, పడుకోవడం మూడు గంటలు పడుకుంది. లేచాక నవ్వుతూ చేతిలో వ్రాలిపోయింది. ఎంత ఫ్రెష్‌గా ఉందో, ఎంత కమ్మని వాసనేస్తుందీ - ఆకలిమీద సీసాడు పాలు గటగట తాగేసింది. సీసాడు పాలు మూడుసార్లు

బలవంతంగా తాగేది రోజు. పాపని ఎత్తుకున్న అమ్మమ్మ తాతగారిని ఫోటోలు తీసింది.

"నిజమే అమ్మమ్మ పాప ఆవురావురుమని పాలన్నీ తాగేసింది. ఎప్పుడూ లేదిలా." కమ్మని వాసనొస్తున్న కూతురిని ముద్దు పెట్టుకుంటూ అంది.

"ఒక్క వారం రోజులుండు. నీ కూతురిని బంతిలా చేసి పంపిస్తాను." రెండు రోజులనుకున్నది ఐదురోజులుండిపోయింది. వచ్చిన చుట్టాలందరి ఫోటోలు తీసింది. ఈరోజు పాపకి అవన్నీ చూపిస్తుంటే పాతస్మృతులు పైకి వచ్చాయి. అమ్మమ్మ అన్నట్లే మళ్లీ ఇంకా ఆ ఊరే వెళ్లలేదు. తరువాత ఏణ్ణర్ధానికే తాతగారు కూర్చున్న వారు కూర్చున్నట్లే పోయారు. మరో ఏడాదికి అమ్మమ్మ. మామయ్యలు అమెరికా నించి వచ్చి పొలం, ఇల్లు అమ్మి అంతా డబ్బులు పంచుకు వెళ్లిపోయారు. ఫోటోలే మిగిలాయి.

* * * * * *

తరువాత శృతి తీరికున్నప్పుడల్లా లాప్‌టాప్ పెట్టుకుని ఆ సిడి చూస్తూ మురిసి పోయేది. చూసినప్పుడల్లా ఒకో ప్రశ్న - ఒకో సందేహం.

"మమ్మీ. మీ చిన్నప్పుడులా ఇప్పుడెందుకు మీరంతా కలవడం లేదు. శలవులకి రావచ్చు గదా. అందరం అమ్మమ్మగారింటికి వెళ్ళచ్చుగదా!"

"ఎలా కుదురుతుంది. మా అక్క అన్న అమెరికానించి రావాలంటే బోలెడు ఖర్చు. వాళ్ల పిల్లలకి శలవులు, వీళ్ల ఉద్యోగాలకి శలవులు దొరకాలి గదా. అంత దూరం నుంచి రావాలంటే ఎంత ఖర్చు."

"అమెరికాలో ఎందుకు ఉండడం. మనలా ఇండియా వచ్చేయచ్చు గదా."

"మంచి ఉద్యోగాలు, మంచి జీతాలు. ఇండియాలో అంత డబ్బులివ్వరని రారు ఎవరూ..."

"మరి మనం ఎందుకు వచ్చేశాం?"

"మన సంగతి వేరు. నేనొక్కర్తిని నిన్ను చూసుకోలేక వచ్చేసాను. అక్కడ పనివాళ్లు దొరకరు గదా. ఇక్కడ మంచి ఉద్యోగం దొరికింది. అందుకు వచ్చేశాను."

"మరి డాడి వుండేవారుగదా, డాడిని నీవు వదిలి వచ్చేశావు - మరి డాడి మనతో ఎందుకు రాలేదు?"... ఇదివరకు రెండు మూడు సార్లు అడిగిన ప్రశ్న మళ్లీ అడిగింది.

"ఆయనక్కడ ఉద్యోగం వదలడానికి ఇష్టంలేక రాలేదు" ముభావంగా అని, లాప్‌టాప్ ఇంకో దృశ్యం వైపు చూపిస్తూ "చూశారా ఇది మీ మామయ్య పెళ్లి ఫోటో. హోస్టన్‌లో ఉంటాడు గదా మురళి అన్నయ్య... రెండేళ్ల క్రితం ఇండియా వచ్చాడు గదా. వాడి పెళ్లి. వనజ ఆంటీ చూశావా. పెళ్లి కూతురు గదా ఎన్ని నగలు పెట్టుకుందో. ఇదిగో ఇది వడ్డాణం. వంకీలు.. యివన్నీ నాకు మా అమ్మ చేయించింది. నీకిచ్చేస్తాను నీ పెళ్లికి..." మాట మార్చి చెపుతూంటే ఏడేళ్ల శృతి మొహంలో సంతోషం - సిగ్గు.

ఇండియా వచ్చిన ఈ రెండేళ్లలో శృతి చాలా తెల్సుకుంది. శృతి పెద్దదవుతుంది. స్కూల్ పిల్లలు, టీవీ సీరియల్స్... ఇంట్లో వంటామె నర్సమ్మ, పనిమనిషి సీతాలుతో మాట్లాడి తెలుగు బాగా నేర్చింది. "మా ఫ్రెండ్సందరికి డాడిలు, మమ్మీలు కల్సి ఉన్నారు. నాకే డాడీ లేరు... డాడిని వచ్చేయమను మమ్మీ" ఓరోజు స్కూలునించి వచ్చి అలిగి కూర్చుంది. 'ఆయన రారమ్మా - ఎన్నోసార్లు చెప్పా నీకు' కీర్తన విసుగ్గా అంది. "అయితే మనమే వెడదాం."

'అదీ కుదరదు... శృతీ నీవు చిన్నపిల్లవు. నీకిప్పుడు నేను చెప్పినా అర్థం కాదు.'

"నాకన్నీ తెలుసు. నీవు అబద్ధాలు చెప్తున్నావు. డాడీ నీవు డైవోర్సు తీసుకున్నారు గదూ."

మా ఫ్రెండ్స్ అన్నారు. మీ మమ్మీ నీవు వంటరిగా ఉన్నారంటే మమ్మీ డాడీ విడిపోయారన్నమాట. లేకపోతే ఈ రెండేళ్లలో మీ డాడి ఒక్కసారన్నా వచ్చారా - నీతో మాట్లాడారా అనడిగారు. ... నీవు నాదగ్గర ఎందుకు దాస్తావు ఇదంతా" నిలదీసింది.

ఈకాలం పిల్లలకి చాలా తెలివితేటలున్నాయి. మంచి ఎక్స్‌పోజర్ వుంది. అన్ని విషయాలు చూసి నేర్చుకుంటున్నారు. ఇలాంటి పిల్లలకి నిజం చెప్పడం నయం అనుకుంది కీర్తన. "సరే - నీవిప్పుడు కాస్త పెద్దయ్యావు. నీకన్నీ తెల్సు అన్నావు గదా. అవును డాడీ నేను డైవోర్సు తీసుకున్నాం. ఆయన ఇంక మన దగ్గరికి రారు."

"ఎందుకు? డైవోర్స్ ఎందుకు తీసుకున్నారు?"

"మా ఇద్దరికి పడలేదు. రోజూ కొట్టుకుంటూ తిట్టుకుంటూ మనశ్శాంతి లేకుండా ఎందుకు కల్సి బతకడం?"

"అంటే డాడి నిన్ను తిట్టారా? కొట్టారా?" ... మరో ప్రశ్న.

"కొట్టడం, తిట్టడం కాదు. మనసులు కలవకపోతే ఒకరినొకరు సాధించుకుంటూ ఎడమొహంగా బతకడం కుదరదు" కాస్త కఠినంగా అంది.

"సాధించడం అంటే .. నీవు.. నన్ను పాలు తాగు అని కేకలేస్తావు. ఈ షూస్ అక్కడ ఎందుకు పడేశావు అని తిడ్తావు. టి.వి. అస్తమాను చూడద్దని కేకలు పెడ్తావు. షాంపు చేసుకో, పళ్లు బాగా బ్రష్ చేసుకో అంటూ ప్రతి దానికి వెంటపడి సాధిస్తూనే ఉంటావు గదా. మరినన్ను వదిలేసి వెళ్లిపోతావా ఓ రోజు..." సూటిగా కళ్లలోకి చూసి అంది. కీర్తన తెల్లబోయి చూసింది. "అయితే నేనూ ఇంట్లోంచి వెళ్లిపోవాలా.. నీ చిన్నప్పుడు అమ్మమ్మ తాతగారు కోపం వచ్చి కేకలువేస్తే ఇల్లు వదిలి వెళ్లి పోయావా..." నిలేసినట్టు అడిగింది. ఆ ధోరణికి విస్తుపోయింది కీర్తన. ఏడేళ్ల పిల్ల ఎలా అడుగుతుంది. కోపంతో మొహం ఎర్రబడింది. 'శృతీ... ఏమిటా పెద్దమాటలు. పిల్లలు పిల్లల్లా ఉండాలి. నేను చెప్పినా నీకర్థం కాదు.'

"చెప్పు... అర్థం అయ్యేట్టు చెపితే వింటాను" శృతి రెట్టించింది.

"చూడు తల్లి పిల్లలు, తండ్రి... ఈ సంబంధాలు వేరు. భార్యాభర్తల సంబంధం వేరు."

"ఎందుకు వేరు. నేను ఏంచేసినా ఊరుకుంటావు. మీ అమ్మా నాన్న కేకలేసినా సహిస్తావు. మరి డాడి దగ్గర అలా ఉండవచ్చు గదా. డైవర్స్ ఎందుకు తీసుకోడం". కీర్తన నిస్సహాయంగా చూసింది. ఎలా చెప్పి కూతుర్ని నమ్మించాలో అర్థం కాలేదు.

"డాడీకి సారీ చెప్పి పిలు. వస్తారు" పంతంగా అంది.

"శృతీ నీకు చెపితే అర్థం చేసుకోవు. ఆయన మళ్లీ పెళ్లి చేసుకున్నారు. ఇంక ఆయనకి నాకు ఏ సంబంధం లేదు" నిష్కర్షగా అంది.

శృతి హతాశురాలైనట్టు చూసింది. తల్లి వంక కోపంగా చూసి విసురుగా లోపలికి వెళ్లిపోయింది.

మరో రోజు రాఖిపౌర్ణమి – టీ.వి.లో అన్నలకి అక్క చెల్లెళ్లు రాఖి కట్టడం చూసింది. 'పోనీ సరే డాడి రారు. నేనొక్కర్తినే ఉన్నాను. నాకు ఓ తమ్ముడు కావాలి. తెచ్చి ఇవ్వు. ఆడుకుంటాను. రాఖి కడ్తాను. నా బొమ్మలన్నీ ఇస్తాను. మేం ఇద్దరం కలిసి గేములాడుకుంటాం. నాకు ఎవరూ లేరు. బోరు కొడ్తుంది. చిన్నప్పుడు నీకు

నీ బ్రదర్స్ ఉన్నారు. మీరంతా సరదాగా ఆడుకునే వారు. నాకొద్దామరి...' సూటిగా అడిగింది.

"తమ్ముడు ఎలా వస్తాడే. యిదేం బొమ్మా కొనివ్వడానికి..." నవ్వింది కీర్తన.

"ఏం నీ పొట్టలోంచే గదా వస్తారు పాపాయిలు. టీవిలో చూశాగా. ఓ పాప వాళ్ళమ్మ పొట్ట చేత్తో పట్టుకుచూసింది. తరువాత పాపాయిని అమ్మ వళ్లో పడుకో బెట్టింది. తరువాత పాపాయిని అమ్మ వళ్లో పడుకోబెట్టింది వాళ్ళమ్మ." కీర్తన నిస్సహాయంగా చూసింది.

'పాపాయిలు వుత్తినే అలా పొట్టలోంచి వచ్చేయరు. డాడీలు లేకుండా పాపాయిలు రారు' శృతి ఆశ్చర్యంగా అర్థం కానట్టు చూసింది. 'సరే, అయితే ఇంకో డాడిని తీసుకురా...' అంది.

'బాగుంది. చాలా బాగుందీ నీ వరస. తల్లీ ఇంకో డాడి నాకు మొగుడవ్వచ్చు గాని నీకు డాడి కాలేరే. ఎలా చెప్పాలే నీకు.' కీర్తన మనసులో విసుక్కుంది.

"శృతీ అదంతా జరిగే పని కాదు. ఊరికే పిచ్చిమాటలు మాట్లాడకు."

"అప్పుడే.. డాడీ ఉన్నప్పుడే ఇంకో పాపాయిని తేవల్సింది. ఈ పాటికి చక్కగా నాతో అడుకునేదిగా... అప్పుడెందుకు ఊరుకున్నావు.. అందరికీ ఇద్దరు ముగ్గురు పిల్లలు."

"సరే, ఈ ఉద్యోగాలతో ఒంటరిగా ఒక పాపను పెంచేసరికి తాతలు దిగి వచ్చారు. ఇంకో పిల్ల కూడానా... ఇదివరకు ఆడవాళ్లకి ఉద్యోగాలవి ఉండేవి కావు. పిల్లల్నికని సావకాశంగా పెంచేవారు. ఇప్పుడాడవాళ్లకి ఉద్యోగాలు చేస్తూ పిల్లలని పెంచడం కష్టం అవుతుంది..." కీర్తన సంజాయిషీ ఇచ్చింది.

"ఉద్యోగం మానేయాల్సింది" తప్పు నీదే అన్నట్టు అంది.

అవును ఉద్యోగం మానేసి తిక్కమొగుడితో కాపురం చేసి ఇంకో పిల్లను కనుంటే తన పాట్లు, తన గతి ఏమయ్యేది. స్వాభిమానం చంపుకుని ఆరేళ్లు గడిపింది. మారతాడన్న భ్రమతో, ఓ రెండేళ్లు పిల్లలు కనే సౌలభ్యమే కుదరలేదు. జీవితంలో స్థిరపడడానికే టైము పట్టింది. కావాలనుకున్నా ఓ ఏడాది పట్టింది గర్భం రావడానికి. పురుడు, చంటిపిల్ల, చాకిరి, భర్త సహకారంలేక ఎంత నరకం చవిచూసింది. ఉద్యోగంలో చేరాల్సిన సమయం. పిల్లని క్రెష్‌లో ఉంచడం, తీసుకురావడం, పని... పని... ఎంత చేసినా తృప్తిలేని భర్త... ఆ సాధింపు ... ఆ కోపాలు... ప్రాణం

విసిగెత్తి ఓర్పు ఆఖరి మెట్టుకు చేరాక నాలుగేళ్ల పాపతో ఇండియా వచ్చేసింది. భర్తకు విడాకులు ఇచ్చి కొత్త జీవితాన్ని ఓ కొలిక్కి తీసుకు వచ్చేవరకు అమ్మా, నాన్న సహాయం ఉండబట్టి నిలదొక్కుకుంది. మళ్లీ కొత్త ఉద్యోగం, కొత్తచోటు, పల్లెటూరి నించి తెచ్చుకున్న పనమ్మాయి సీతాలు సాయంతో పాపని పెంచుకుంటూ ఒంటరి అయినా కనీసం ప్రశాంతంగా బతకగల్గింది గత రెండేళ్ల నించి. ఇప్పుడు పాపకి కాస్త జ్ఞానం వచ్చి చుట్టూ ఉన్న పిల్లలని చూసి తెలుసుకుని వేసే ప్రశ్నలకి జవాబివ్వడం ఎంత కష్టం అయింది. పాప పెద్దయ్యాక ఎలాగో తండ్రి ప్రస్తావన వచ్చి అడుగు తుందని తెలుసుగానీ, ఇంత చిన్నప్పుడే ఇలా నిలేస్తుందని ఎదురుచూడలేదు. నీకెలా చెప్పాలే ఎలా చెపితే అర్థం అవుతుంది... కీర్తన విలవిల్లాడింది.

శృతి ఈ మధ్యన చాలా మూడీగా తయారయింది. మాటలు తగ్గించేసింది. బొమ్మలతో ఆడుకోడం మానేసింది. స్కూలు, హోంవర్కు చేసుకుని టి.వి. ముందు కూర్చుంటుంది. పలకరిస్తే పది మాటలకి ఓ మాట జవాబు చెప్తుంది. టీవి చూడకపోతే లాప్‌టాప్‌లో చూసిన దృశ్యాలే చూస్తూంటుంది తల్లి మీద అలిగినట్టు. ఇదివరకులా స్కూలు సంగతులు, టీవీలో చూసిన దృశ్యాలు ఏ విషయం మాట్లాడడం లేదు. "శృతీ ఏమిటలా వున్నావు?" ఎన్నిసార్లడిగినా జవాబివ్వకుండా పెద్ద కళ్లని మరింత పెద్దవిచేసి తల్లిని మింగేసేట్టు చూస్తుంది. మరీ గట్టిగా ఓ రోజు అడిగితే "ఎలా వుండాలి మరి. నాకెవరున్నారు ఆడుకోడానికి. మాట్లాడటానికి. నీవు ఆఫీసు నుంచి రాత్రి అయ్యాక వస్తావు. అప్పుడు నాకు నిద్ర వస్తూంటుంది. ఇంట్లో సీతాలు, వంట అవ్వతో ఏం మాట్లాడాలి. ఏ గేమ్స్ ఆడుకోవాలన్నా ఎవరూ లేరు" అరిచింది.

నిజమే ఆ అపార్ట్‌మెంట్స్‌లో శృతి యీడు పిల్లలు ఎవరూ లేరు. కాలేజీ పిల్లలు, లేకపోతే మరీ చిన్నపిల్లలు, ఉద్యోగం చేసే అమ్మాయిలు, మూడొంతులు రిటైరైన ముసలివారు.

"పక్కింటి స్వీటీ అక్కదగ్గరికి కాసేపు వెళ్లొచ్చుగదా" స్వీటి ఇంజనీరింగ్ చదువుతున్నా అప్పుడప్పుడు స్వీటీతో మాట్లాడుతూంటుంది.

"తనెప్పుడూ కంప్యూటర్ ముందు కూర్చుంటుంది. లేకపోతే సెల్‌ఫోన్ పట్టుకుంటుంది. వెళ్లి ఏం చేయాలి."

"బాగుంది వరస. నన్నేం చెయ్యమంటావు. ఇప్పుడందరూ ఎవరి లైఫ్‌లో వాళ్లు బిజీ

మనకి మనమే కాలక్షేపం వెతుక్కోవాలి. కీర్తనకి శృతి వంటరితనం అర్థం అవుతున్నా ఏం చెయ్యగలదు?" ఆ సి.డి. చూపించి తప్పుచేశానా అనిపించింది.

* * * * * *

"శృతీ, నీకు ఆడుకోవడానికి తమ్ముడు కావాలా, చెల్లెలు కావాలా?" ఓరోజు ఆఫీసునుంచి వచ్చి, తనతో మాట్లాడకుండా అలక సాగిస్తున్న శృతిని పక్కన కూర్చోపెట్టుకుని అడిగింది.

శృతి కళ్లల్లో మెరుపు. తల్లి కడుపు వైపు చూసి 'నిజంగా పాపాయి వస్తుందా' ఆశగా తల్లి పొట్టమీద చెయ్యి వేసింది. కీర్తన నవ్వి 'చెప్పు మరి తమ్ముడా, చెల్లెలా?'

శృతి ఓ క్షణం ఆలోచించి 'చెల్లివద్దు - తమ్ముడయితే రాఖి కట్టవచ్చు. ఆడపిల్లని నేను ఉన్నానుగా. తమ్ముడే కావాలి. ఎప్పుడొస్తాడు తమ్ముడు' ఆరాటంగా అడిగింది.

"వస్తాడు. అడిగిన వెంటనే రారు పాపాయిలు, టైము పడ్తుంది."

"నిజంగా అంటున్నావా. ప్రామిస్" అంది. కూతురి చేతిలో చెయ్యివేసి "ప్రామిస్, మరింక నీవు సంతోషంగా వుండాలి మరి. తమ్ముడొచ్చాక నీవు బాగా చూసుకోవాలి. ఆడించాలి. నేను ఇంట్లో లేనప్పుడు సీతాలు సాయంతో నీవే చూసుకోవాలి."

"ఓ. ఎస్. అన్నీ నేనే చేస్తా. పాలు పడ్తా. బొమ్మలన్నీ యిచ్చేసి ఆడిస్తా. రాఖి కడ్తాను" సంబరంగా అంది. కూతురి ముఖంలో ఆనందం చూశాక తన నిర్ణయం సరి అయిందే ననిపించింది కీర్తనకి.

* * * * * *

ఆర్నెల్ల తరువాత ... ఓ ఆదివారం ఉదయం కారులో వెళ్లి ఓ మూడేళ్ల బాబుని వెంట పెట్టుకువచ్చింది కీర్తన. శృతి సంభ్రమంగా చూసి ... "చిన్న పాపాయి కదా. ఇంత పెద్ద బాబా! నీవు ఒళ్లో పడుకోపెట్టుకుని వస్తావనుకున్నాను" అంది ఆశ్చర్యంగా.

"నీతో వెంటనే ఆడుకుంటాడని పెద్దబాబుని తెచ్చాను. నిన్ను ఇప్పుడే అక్క అంటాడు. నీతో ఇప్పుడే ఆడుకుంటాడు చక్కగా... రా.. ఇలారా..." అంటూ శృతిని పక్కన కూర్చోపెట్టుకుని బాబు చెయ్యి చేతిలో పెట్టింది. బితుకుబితుకుమని, కొత్తచోటుని వింతగా చూస్తూ పెద్దకళ్లని అమాయకంగా యిటు అటు తిప్పుతున్న బాబుని చూసి "అమ్మా ముద్దుగా ఉన్నాడు కాదమ్మా - బాగున్నాడు కాని సన్నగా ఉన్నాడు. అమ్మో ఎంత పెద్ద జుత్తో..." అంది సంబరంగా.

"మనింటికి వచ్చాడుగా. మనం బాగా చూసుకుంటే చక్కగా బొద్దుగా ముద్దుగా తయారవుతాడు సరే మరి మంచి పేరు పెట్టు మరి..."

"చిన్ని కృష్ణుడిలా ఉన్నాడు. వంశీ... అందామా" అంది శృతి. "ఆ.. మంచిపేరు. అలాగే పిలుద్దాం." రా మరి ఒళ్లో కూర్చోపెట్టుకుని బాబుతో మాట్లాడు.." శృతి అపురూపంగా బాబుని ఒళ్లో పెట్టుకుని 'వంశీ, నీ పేరు బాగుందా. నన్ను అక్కా. అను' అంటూ బాబుతో మాటల్లో పడిపోయింది. ఆకళ్లలో మెరుపు, ఆనందం చూసి కీర్తన నిశ్చింతగా నిట్టూర్చింది.

"శృతీ, సారీ రా, నీకు ఆ చెట్లు చామలు, పూలు పళ్లతోటలు, ఆవు దూడలు, ఉడతలు, చిలకల పక్షి గూళ్లు, చిలక కొరికిన జామ పండ్ల రుచి ... కజిన్స్‌తో ఆడుకునేందుకు ఎవరిని తెచ్చి ఇవ్వలేను. మేం గడిపిన మా బాల్యాన్ని మీకివ్వలేని మమ్మల్ని క్షమించమ్మా" అనుకుంది. నీకీయగల్గింది ఇంతే తల్లీ.!

***(నవ్య, ఏప్రిల్ 28, 2010)***